క్లుప్తంగా

నేడు చింతలగుంటలో జగనన్న సురక్ష

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చింతలగుంట సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో దరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలను పొందాలని ఆయన కోరారు.

వెంగంపల్లిలో..

తవణంపల్లి: మండలంలోని వెంగంపల్లె, టి.పుత్తూరు గ్రామాల్లో గురువారం ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. గ్రామ సభల్లో లబ్ధిదారులకు ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: బంగారుపాళెం, యాదమరి వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. బంగారుపాళెం సబ్‌స్టేషన్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్పీడీసీఎల్ వినియోగదారుల పరిష్కార వేదిక అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ అదాలత్ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

కారుణ్య నియామకం


నియామక పత్రం అందజేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థలో కారుణ్య నియామకం ఉత్తర్వులను కమిషనర్ అరుణ బుధవారం జారీ చేశారు. నగరపాలక సంస్థలో పీహెచ్ వర్కర్ ఎం.బాబు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమారుడు ఎం.కనకేశ్వర్ కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకున్నారు. నగర కమిషనర్ అర్హత ధ్రువపత్రాల పరిశీలన అనంతరం కనకేశ్వర్‌ను పీహెచ్ మేస్త్రీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను నగర మేయర్ ఎస్.అముద చేతుల మీదుగా కనకేశ్వర్‌కు అందించారు.

గణేష్ దీక్ష భక్తులకు స్థలం కేటాయించాలి


ఈఓకు వినతి పత్రం ఇస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దీక్ష చేపట్టే భక్తులకు వసతి, భిక్ష ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని ఆలయ ఈఓ వెంకటేశుకు టీటీడీ బోర్డు సభ్యులు, అఖిల భారత గణేష్ సేవాదళ్ చైర్మన్ మురంశెట్టి రాములు వినతి పత్రం అందించారు. ఈమేరకు ఆయన బుధవారం సాయంత్రం ఆలయ ఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాణిపాకం బోర్డు మెంబర్ నరసింహుల శెట్టి, ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు చేగు ప్రశాంత్, మీడియా చైర్మన్ తేజ, కర్ణాటక గణేష్ దీక్ష ప్రచారక్ నూనే ప్రకాష్, చిత్తూరు ప్రసాద్, పామిడి రామూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

యాదమరి: గ్రామాలలో ఉన్న ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యాధికారి సురేఖ సూచించారు. ఆమె బుధవారం ఆస్పత్రి ఆవరణలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతూ మాతాశిశు మరణాలను పూర్తిగా నియంత్రించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవానంతరం, చిన్నారికి ఐదేళ్లు వచ్చేంతవరకు టీకాలు సకాలంలో అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో విజయానంద రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి బుధవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.


చిత్రపటం అందుకుంటున్న విజయానందరెడ్డి

అంతరాలయ దర్శనం అస్తవ్యస్తం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అంతరాలయ దర్శనాలు అస్తవ్యస్తంగా మారాయి. పునర్నిర్మాణం తరువాత భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. రద్దీకి తగినట్లుగా ఆలయాధికారులు ప్రత్యేక క్యూలు, దర్శన ఏర్పాట్లు చేశారు. అయితే ఆలయ సిబ్బంది దళారులుగా మారి, డబ్బులిచ్చిన వారికి ప్రత్యేకంగా అంతరాలయ దర్శనాలు చేస్తూ, సామాన్య భక్తులకు అసలు దర్శనం లేకుండా బయటకు తోసేస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించిన సామాన్య భక్తులు మనోవేదనతో తిరిగి వెళుతున్నారు.

- దళారుల అవతారమెత్తిన ఆలయ సిబ్బంది
- డబ్బులిస్తే అడ్డగోలుగా క్యూలోకి ప్రవేశాలు
- కాణిపాకంలో సామాన్యులకు దక్కని స్వామి దర్శనం


అడ్డదారిలో భక్తులను ఆలయంలోకి పంపుతున్న సిబ్బంది


కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

కాణిపాకం (యాదమరి): జిల్లాలోనే ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి దర్శనం సామాన్యులకు అందకుండా పోతోంది. ఈ ఆలయాన్ని గత ఏడాది పునర్నిర్మించారు. అప్పటి నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. సెలవు రోజుల్లో ఈ తాకిడి మరింత అధికంగా ఉంటుంది. ఈ రద్దీని నియంత్రించడానికి ఆలయ పాలక మండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. భక్తుల సంఖ్యకు తగినట్లుగా క్యూలు, నిరీక్షించడానికి కంపార్ట్‌మెంట్లు వంటివి ఏర్పాటు చేసింది. ఆలయానికి ఆదాయాన్ని సమకూర్చేలా ప్రత్యేక దర్శనాలకు రూ.150, రూ.100 టికెట్లు ఏర్పాట్లు చేసింది. ప్రొటోకాల్ భక్తులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తూ విధి విధానాలు రూపొందించారు. మొదలు సాఫీగా సాగిన ఈ దర్శనం క్రమంగా గాడి తప్పింది.

సెక్యూరిటీ, సిబ్బందే దళారులు

భక్తుల రద్దీని అవకాశంగా మలుచుకున్న ఇక్కడి సెక్యూరిటీ గార్డులు, ఆలయ సిబ్బంది దళారీలు మారిపోయారు. అంతరాలయ దర్శనానికి ఒక్కో భక్తుడి వద్ద రూ.1000 నుంచి రూ. 2 వేలు, సాధారణ దర్శనానికి రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా డబ్బులు తీసుకుని ఎక్కడపడితే అక్కడ గేట్లు తెరిచి క్యూ మధ్యలో వదిలేస్తున్నారు. మరోవైపు ఈ సిబ్బంది అంతరాలయ దర్శనానికి భక్తులను గుంపులు, గుంపులుగా వదిలేస్తున్నారు. వీరందరూ గర్భాలయంలోకి వెళ్లి స్వామి వారికి అడ్డంగా నిలుచుంటున్నారు. అదే సమయంలో వచ్చే సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కావడం లేదు. గర్భాలయంలో భక్తులే కిక్కిరిసిపోయి ఉండడంతో వల్ల స్వామివారి మూల విరాట్టు కనిపించడం లేదు. దీంతో కాసేపు సామాన్య భక్తులు దర్శనం కోసం ఎగాదిగా చూస్తూ ఉంటే, సిబ్బంది వారిని ఇక వెళ్లండి అంటూ బయటకు తోసేస్తున్నారు.

అసంతృప్తిలో సామాన్య భక్తులు

స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కోసం ఎక్కడెక్కడి నుంచో రోజుల తరబడి ప్రయాణించి వచ్చిన భక్తులు, గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్నారు. ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల నిర్వాకంతో అసలు స్వామి వారిని చూడకుండానే అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. మరి కొందరు భక్తులైతే ఇక్కడ అధికారులు, ఉన్నారా లేదా? అని తిట్టుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సామాన్యులకు వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కల్పిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే!

డబ్బులిస్తే దర్శనం అయిపోయింది



శని, ఆదివారాలు సెలవని తిరుమలకు వచ్చాము. ఇంత దూరం వచ్చాం కదా అని కాణిపాకం వచ్చాము. అన్ని క్యూలలో భక్తులు కిక్కిరిసిపోయి ఉన్నారు. ఇంతలోనే ఎవరో ఒకరు వచ్చారు. డబ్బులు ఇస్తే దర్శనం త్వరగా అయ్యే ఏర్పాటు చేస్తామన్నారు. మేము నలుగురం ఉన్నాం. ఒక్కొక్కరికి రూ.1000 అడిగారు. అంత లేదు అంటే సరే ఒక్కొక్కరికి రూ.500 ఇవ్వండి అన్నారు. అలాగే అని చెప్పి రూ.2000 ఇచ్చాం. త్వరగా దర్శనం అయిపోయింది.

– రాంజీ, భక్తులు హైదరాబాద్

రూ.150 టికెట్ తీసుకున్నా .. ఏం లాభం



మేము కాణిపాకానికి ప్రతి సంవత్సరం వస్తాం. ఈ సారి ఆలయం ఆధునీకరించారు అని తెలుసుకుని, కుటుంబ సమేతంగా వచ్చాం. ప్రత్యేక దర్శనం కోసం రూ.150 టికెట్ కొనుక్కున్నాం. కానీ ఆలయ సిబ్బంది ఎక్కడపడితే గేట్లు తీసి కొంతమంది భక్తులను క్యూలోకి పంపుతున్నారు. మేము టికెట్ తీసుకుని అక్కడే నిల్చున్నాం. వెనక వచ్చే వాళ్లని ముందు పంపుతున్నారు. టికెట్ తీసుకుని ఏం లాభమో నాకర్థం కావడం లేదు.

– రాజ కన్నన్, భక్తుడు, చెన్నై

స్వామి దర్శనమే కాలేదు



మా ఊరు కాణిపాకం పక్కనే ఉంది. చాలా రోజుల తరువాత స్వామిని దర్శించుకోవడానికి కాణిపాకం వచ్చాను. రద్దీ ఎక్కువగా ఉంది. ఉచిత క్యూలో వెళ్లాను. బాగా అలసిపోయాను. చివరికి గర్భగుడి లోకి చూశాను కానీ స్వామి కన్పించలేదు. గుడి లోపల జనం నిండిపోయారు. ఇంతలో అక్కడ ఉన్న సిబ్బంది వెళ్లాలి అంటూ తోసేశారు. గర్భగుడి లోపలకు భక్తులను ఎందుకు పంపుతున్నారో అర్థం కావడం లేదు.

– బుజ్జమ్మ, భక్తురాలు, తవణంపల్లె

సామాన్య భక్తులకే ప్రాధాన్యం



సామాన్య భక్తులకు మొదటి ప్రాధన్యత ఇస్తాం. వారికి సక్రమంగా దర్శనాలు జరగలేదని తెలిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ప్రొటోకాల్ తప్ప మరెవరికీ వీఐపీ గేట్ ద్వారా దర్శనాలు లేవని చెప్పాం. కానీ సిబ్బంది కొందరు ఇష్టమొచ్చినట్లు వీఐపీ గేట్‌లో పంపుతున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. దీనిపై సీసీ కెమెరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాము. భక్తులతో దురుసుగా మాట్లాడినట్లు తేలితే వారిపై వేటు వేస్తాం.

– మోహన్ రెడ్డి, చైర్మన్, కాణిపాక ఆలయం

తక్షణం చర్యలు తీసుకుంటాం



అంతరాలయ దర్శనంలో అక్రమాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై పాలక మండలి సమావేశంలో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం. అంతరాలయ దర్శనాలపై నియంత్రణ పాటిస్తాం. సామాన్య భక్తులకు దర్శనం సులభతరం చేస్తాం. ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు. సిబ్బంది ఎక్కడపడితే అక్కడ గేట్లు తీసి భక్తులను లోనికి పంపితే శాఖాపరమైన చర్యలు తక్షణమే తీసుకుంటాం.

– వెంకటేశు, ఆలయ ఈఓ, కాణిపాకం

మేకల పెంపకం లాభదాయం

ఐరాల: గొర్రెలు, మేకల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని పశుసంవర్ధక శాఖ డీడీ ఆరీఫ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక పశువైద్యశాలలో జాతీయ లైఫ్‌స్టాక్ మిషన్ కింద గొర్రెలు, మేకల పెంపకందారులకు శాస్త్రీయ పద్ధతులపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇందులో డీడీ ఆరీఫ్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు విత్తన పొట్టేళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐరాల వెటర్నరీ ఏడీ పద్మావతి, మద్దిపట్లపల్లె వెటర్నరీ అధికారి పినాకపాణి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళలను కాపాడుకుందాం

చిత్తూరు రూరల్: జానపద కళలను, గేయాలను, సంస్కృతిని కాపాడుకుందామని జానపద కళాకారుల సంఘ సభ్యులు సహదేవనాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్జీఓ భవనంలో బుధవారం సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జానపద గేయాలు, కళలను, సంస్కృతిని సంరక్షించుకునే భాగంలో ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జానపద గీతాలాపన మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 6న తిరుపతి శిల్పారామంలో, 13న చిత్తూరు రెవెన్యూ భవనంలో, 20న రాయచోటి రెవెన్యూ భవనంలో, 27న తిరుపతి మహతి కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాజశేఖర్, చిన్నయ్య, సత్యనారాయణ, రవి రఘురాం పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్ పరీక్ష శిబిరం

చిత్తూరు రూరల్: సాయి మాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వారి సౌజన్యంతో శుక్రవారం ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జగదీష్ తెలిపారు. నగరంలోని పీసీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

549 మందికి ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్ : మెగాజాబ్‌మేళాలో 549 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాలో వెయ్యికి పైగా విద్యార్థులు పాల్గొనగా 549 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ సర్కారుకు అండగా నిలబడదాం


డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలబడదామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక 45వ డివిజన్ ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికంగా ఉండే సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, పింఛన్, రేషన్‌కార్డులను అందజేయాలని స్థానికులు సమస్యలను విన్నవించారు. సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రస్తుతం అర్హులకు ఉచితంగా సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి శివారెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ నాయకులు రమణ, రెడ్డెప్ప, అప్పు, హేమంతరెడ్డి, నారాయణ, ప్రకాష్, సీతాపతి, బాబు, ఆనంద, గోపి, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు మంగసముద్రంలో: స్థానిక 45వ డివిజన్ లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మార్కెట్ యార్డు ఆవరణలో రూ.40 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా రైతులు మామిడి విక్రయానికి సమీప మండలాల నుంచి వేలాది మంది విచ్చేస్తుంటారన్నారు. ఇక్కడ డ్రైనేజీ సౌకర్యం లేనందున రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని నగర కార్పొరేషన్ నిధులను వెచ్చించి డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. నగర మేయర్ అముద, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు


లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న అధికారులు

బంగారుపాళెం : ప్రజలందరికీ సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండలంలోని మొగిలి గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 250 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ మనోహరి, ఎంపీటీసీ శ్యామల, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలో తేనేపల్లి ఎస్టీ కాలనీలోని బుధవారం ఆమె ప్రజలతో మాట్లాడారు. ఎస్టీ కాలనీ వాసులు తమకు ఇళ్లు లేవని అర్జీలతో మంగళవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో వారితో మాట్లాడుతూ ఇల్లు లేని వారు, కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రేషన్ కార్డులు, ఆధార్ లేని వారు సమీపంలోని సచివాలయాలను సందర్శించాలని తెలిపారు. తేనేపల్లి లేఅవుట్‌లోని లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ మెరుగైన వైద్యం



గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సందీప్

ఐరాల/గుడిపాల/ తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోనగుంటలో బుధవారం 60 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుడిపాల మండలం పేయనపల్లెలో వైద్యాధికారి సందీప్ 62 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. తవణంపల్లె మండలం నల్లపురెడ్డిపల్లిలో వైద్యాధికారి మోహనవేలు 85 మందికి వైద్య పరీక్షలు చేశారు.

బస్తా తూకంలో మోసం

చిత్తూరు కార్పొరేషన్: బియ్యం బస్తా(26కేజీలు)లో కిలో తక్కువ ఉన్నట్లు తూనికలు కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ దివ్య గుర్తించి వివరాలను మీడియాకు తెలిపారు. నగరంలో బుధవారం పలు దుకాణాల్లో తనిఖీలు చేసి 6 కేసులు నమోదు చేశారు. ఈ మేరకు శేషాపిరాన్‌వీధిలో బాలాజీ బియ్యం స్టోర్‌పై 2, హైరోడ్డులోని వై.కృష్ణామూర్తి గుప్తా అండ్ సన్స్‌పై 2, ఆర్టీసీ కొత్తబస్టాండ్‌లోని మున్సిపల్ క్లాంపెక్స్‌లో గుప్తారైస్ దుకాణం పై 1, మురకంబట్టులోని రిలయన్స్‌స్మార్ట్ పాయింట్ పై 1 కేసు నమోదు చేసినట్లు ఆమె వివరించారు.

హెచ్‌ఎం సేవలు ప్రశంసనీయం


సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

గుడిపాల: మండలంలోని చిత్తపార పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పిళ్లారికుప్పం క్లస్టర్ రిసోర్స్ సెంటర్ రెడ్డిశేఖర్‌రాజు సేవలు విద్యాపరంగా ప్రశంసనీయమని మండల విద్యాశాఖాధికారి రామ్‌నాయక్ పేర్కొన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన చిత్తపార పాఠశాల హెచ్‌ఎం రెడ్డిశేఖర్‌రాజుని క్లస్టర్ పరిధిలో ఉపాధ్యాయులందరూ బుధవారం ఘనంగా సన్మానించారు. వీరితో పాటు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కుమారస్వామి, శైలజ, సుజాత, ప్రసిల్లా, స్వామినాథన్, శరవణను సన్మానించారు. కార్యక్రమంలో అడవిచేను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరిబాబు పాల్గొన్నారు.

యాసిడ్ దాడులను అరికట్టాలి

చిత్తూరు అర్బన్: మహిళలపై యాసిడ్ దాడులను అరికట్టడమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని డీఎస్పీ శ్రీనివాసమూర్తి అన్నారు. చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథిగృహంలో బుధవారం యాసిడ్ విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో యాసిడ్ ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు, వారికి లైసెన్స్‌లు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాసిడ్ దాడులు జరుగుతున్న నేపథ్యంలో పోలీసుశాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఇందులోభాగంగా యాసిడ్ విక్రయదారుల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. యాసిడ్ క్రయ, విక్రయాలపై రికార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అక్రమంగా యాసిడ్ నిల్వలు ఉంచినా, మైనర్లకు విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐలు విశ్వనాథరెడ్డి, గంగిరెడ్డి, రవి శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

భవనాల ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

యాదమరి (పూతలపట్టు): మండలంలో నిర్మించిన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకురాలు గౌహతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం శాంతిపురం మండలం దండు కుప్పం గ్రామంలోని పల్లెబాట నిర్వహిస్తున్న మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. పూతలపట్టు పంచాయతీలో నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్, గ్రంథాలయం, రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, సీసీ రోడ్డు, వనసంరక్షణ సమితి ఆటస్థలాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మూడురోజుల్లో ప్రారంభపు తేదీని ఖరారు చేస్తామని చెప్పినట్లు గౌహతి రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌కుమార్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, గుణేశ్వర్‌రెడ్డి, ఆకనంబట్టు దయాసాగర్‌రెడ్డి, జెట్టిపల్లి చిట్టిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గౌరిశంకర్‌రెడ్డి, రామమూర్తి పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కీరమంద ప్రాథమిక పాఠశాలలో.., ఎగువరాగిమానుపెంటలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని కీరమంద ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, బాబు, వెంకటరమణ, మస్తానీ ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో వారిని సహోపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్, సర్పంచ్ రాజా, సీఆర్‌పీ విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగువరాగిమానుపెంటలో..

మండలంలోని ఎగువ రాగిమానుపెంట జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన సురేష్‌కుమార్, గురుప్రసాద్, పూర్ణ, పద్మ, దేవకిని బుధవారం సహోపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సుజాత, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవరెండ్ విక్టర్‌కు అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్: నగరంలోని గంగనపల్లికి చెందిన రెవరెండ్ చక్రం జాన్ విక్టర్‌కు బుధవారం కుటుంబీకులు, మతపెద్దల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈయన మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సెయింట్ లూక్ చర్చిలో పాస్టర్ జయకరస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి కన్నన్‌కళాశాల సమీపంలోని క్రైస్తవుల శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

భర్త వేధింపులతోనే వివాహిత ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్: భర్త వేధింపులతో తమ కుమార్తె ఆత్మహత్యకు యత్నించినట్లు తమిళనాడులోని గుడియాతత్తానికి చెందిన బాధితురాలి తండ్రి ఇబ్రహీం బుధవారం నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు, చిత్తూరు నగరం న్యూ బాలాజీ కాలనీకి చెందిన ముజీబ్‌కు మోబీనాతో 9 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనారోగ్య కారణాల వల్ల మోబీనా ఈనెల 15న తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. అయితే భర్త వేధింపులతోనే తన కుమార్తె ఆత్మహత్యకు యత్నించినట్లు తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.